
సాక్షి వికారాబాద్

శుక్రవారం । 15 । మార్చి । 2024




ప్రణాళిక మరిచి..

ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులు చేయకుంటే ప్రజా ధనం వృథా అయ్యే అవకాశం ఉంటుంది. 10లో▸



పారిశుద్ధ్య లోపం..

మున్సిపాలిటీ చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో ప్రజలు రోగాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. 11లో▸



న్యూస్‌రీల్

వర్షపు నీటిని ఒడిసిపట్టాలి

కేంద్రీయ భూగర్భ జల బోర్డు రీజినల్ డైరెక్టర్ కృష్ణమూర్తి



మాట్లాడుతున్న కృష్ణమూర్తి

అనంతగిరి: భూగర్భ జలాలను పెంచుకునేందుకు వర్షపు నీటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్రీయ భూగర్భ జల బోర్డు రీజినల్ డైరెక్టర్ జి.కృష్ణమూర్తి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని జిల్లా సమాఖ్య భవనంలో భూగర్భ జల సమస్యలు, నిర్వహణపై ఉపాధి హామీ క్షేత్రస్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాల ప్రభావం వల్ల ఉపరితల జలం మానవ అవసరాలకు సరిపోవడం లేదన్నారు. ప్రతి నీటి బిందువును ఒడిసి పట్టేందుకు చెక్ డ్యాంల నిర్మాణాలు పెద్ద సంఖ్యలో చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం డీఆర్‌డీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు భూగర్భ జలాలను పెంపొందించేందుకు కార్యాచరణ మొదలు పెట్టాలని ఆదేశించారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద కాలువలను బాగు చేసి చెరువులు, కుంటల్లోకి వర్షపు నీరు వచ్చేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో భూగర్భ జలాల శాస్త్రవేత్తలు రాణి, సుధీర్‌కుమార్, మాధవ్, అథర్వపవర్, యాదయ్య, శరత్ తదితరులు పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండొద్దు

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్



దరఖాస్తులను పరిశీలిస్తున్న లింగ్యానాయక్

పెద్దేముల్: ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండరాదని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. గురువారం మండల రెవెన్యూ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ రికార్డులు సక్రమంగా ఉంచాలని, కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అనంతరం ధరణి దరఖాస్తులపై ఆరా తీశారు. మండలం నుంచి 599 దరఖాస్తులు వచ్చాయని, ఈ నెల 17లోగా పరిష్కరిస్తామని తహసీల్దార్ కిషన్ వివరించారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ వచ్చేలోపు అన్ని సమస్యలు పరిష్కారం కావాలని అడిషనల్ కలెక్టర్ ఆదేశించారు.

రేపు లోక్ అదాలత్

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో ఈ నెల 16న నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోటిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో సూచించారు. కేసులను రాజీ చేసుకోవాలనుకునే వారికి ఇది చక్కటి అవకాశమని తెలిపారు. రాజీ మార్గమే రాజమార్గమని సూచించారు.

గిరిజనులకు అన్యాయం



గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పరిగి: గిరిజన నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్‌కు గురువారం ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. డీఎస్సీలో స్థానిక ఏజెన్సీ రూల్ ఆఫ్ రిజర్వేషన్ వందశాతం అమలు చేయాలని కోరారు. తక్షణమే ప్రభుత్వం గిరిజన రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గిరిజన నిరుద్యోగులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గోవింద్ నాయక్, నాయకులు ప్రకాశ్ రాథోడ్, అరుణ నాయక్ పాల్గొన్నారు.

ఆరుగురు విద్యార్థుల డీబార్

పెద్దేముల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆరుగురు విద్యార్థులు డీబార్ అయ్యారు. గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం కామర్స్ – కెమిస్ట్రీ పరీక్ష జరిగింది. కేంద్రంలో తనిఖీలు నిర్వహించగా ఆరుగురు విద్యార్థుల వద్ద చిట్టీలు దొరకడంతో వారిని డీబార్ చేశారు. డీబార్ అయిన విద్యార్థులు మళ్లీ మొత్తం పరీక్షలు రాయాల్సి ఉంటుందని కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ రమేష్ తెలిపారు.

అనంతగిరి అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన కొలనులో నీళ్లు తాగుతున్న జింకలు



దప్పిక.. లేదిక

వన్యప్రాణుల దాహం తీర్చేందుకు అటవీ శాఖ చర్యలు

- అడవుల్లో సోక్‌పిట్స్ ఏర్పాటు
- సమృద్ధిగా నీళ్లు వదులుతున్న సిబ్బంది
- పలు చోట్ల సోలార్ పంప్ సెట్ల ఏర్పాటు

వికారాబాద్: ఎండలు మండుతున్న నేపథ్యంలో వన్యప్రాణుల దాహం తీర్చేందుకు అటవీశాఖ అధికారులు సమాయత్తమయ్యారు. అటవీ ప్రాంతంలో సోక్ పిట్స్ (కొలనులు)ను ప్రారంభించారు. ఇందులో భాగంగా పలు చోట్ల సోలార్ పంప్ సెట్లను ఏర్పాటు చేశారు. జిల్లాలోని అటవీ ప్రాంతంలో 108 కొలనులు నిర్మించి అందులో నీటిని నింపుతున్నారు. నిరంతరం నీరు ఉండేలా ఎనిమిది సోలార్ పంపు సెట్లను ఏర్పాటు చేశారు.

జిల్లాలో అడవులు

జిల్లాలో 1,08,000 ఎకరాల్లో అటవీ భూములు ఉండగా జిల్లా భౌగోళికంగా 13శాతం అడవులు ఉన్నాయి. ఇందులో 9శాతం గ్రీనరీ..అంటే 15వేల ఎకరాల్లో దట్టమైన అడవులు ఉన్నాయి. వికారాబాద్ చుట్టుపక్కల జిల్లాల్లో ఇదే అత్యధిక శాతం కావడం గమనార్హం. ఈ అటవీ ప్రాంతాన్ని ఐదు క్లస్టర్లుగా, 94 బ్లాకులుగా విభజించారు.ఇందులో అనంతగిరి అడవి ముఖ్యమైనది. కుల్కచర్ల, చించోలి అడవుల్లో చిరుతల సంచారం ఉంది. అనంతగిరి కొండల్లో హైనాలు, దున్నలు, కొండ గొర్రెలు వంటి జంతువులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.ఓ పక్క ప్రభుత్వం అడవులను పెంచేందుకు హరితహారం లాంటి కార్యక్రమాలు చేపడుతుండగా మరోపక్క అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యం, కబ్జాకోరుల కారణంగా అడవుల విస్తీర్ణం తగ్గుతోంది. దీంతో వన్యప్రాణుల మనుగడకు ఆటంకాలు కలుగుతున్నాయి.

అనేక రకాల జంతువులు, పక్షులు

జిల్లాలోని అటవీ ప్రాంతంలో ఫారెస్టు అధికారులు అనేక జంతువులు, పక్షి జాతులను గుర్తించారు. దాదాపు 128 రకాల పక్షి జాతులు ఉన్నాయి. ఆరెంజ్ తల కలిగిన (ఆరెంజ్ హెడెడ్ ట్రస్టు) పక్షులు, నల్ల టోపీ గల మోనార్క్ (బ్లాక్ నెప్‌డ్ మోనార్క్) పక్షి, నెమళ్లు, చిలుకలు, కోకిలలు, గోరువంకలు, పాలపిట్టలు తదితర పక్షిజాతులు ఉన్నాయి. కులకచర్ల, చించోలి అటవీ ప్రాంతంలో చిరుతల సంచారం ఉంది. అనంతగిరి కొండల్లో హైనాలు, దుప్పులు, దున్నలు, కొండ గొర్రెలు వంటివి ఉన్నాయి. ఈ అడవిని ఔషధ వనంగా కూడా పిలుస్తారు. ఇక్కడ సహజసిద్ధంగా పెరిగిన 300 రకాల ఔషధ మొక్కలు ఉన్నాయి. ఫారెస్టు అధికారులు మరో 18 రకాలకు చెందిన 50 వేల ఔషధ మొక్కలను పెంచుతున్నారు. అనంతగిరి అడవులు, కొండలు ఔషధ వైద్యులకు రిసెర్చ్ కేంద్రంగా ఉపయోగపడుతోంది.

తరచూ అగ్ని ప్రమాదాలు

జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో తరచూ అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో వన్యప్రాణులు, ఔషధ మొక్కలకు ముప్పుగా మారింది. కొందరు కావాలనే అడవులకు నిప్పు పెడుతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా కొందరు వన్యప్రాణులను వేటాడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అడవుల్లో ఆహారం, నీరు దొరక్క కొన్ని జంతువులు రోడ్లపైకి వచ్చి ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నాయి. ఇటీవల ధారూరు మండలంలో బైక్ ఢీ కొని కొండ గొర్రె మృతి చెందిన విషయం తెలిసిందే.

ప్రజలు సహకరించాలి



ఎంతో అందమైన, సహజ సిద్ధమైన ఇక్కడ అటవీ ప్రాంతాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత. అడవులకు నష్టం కలగకుండా అన్ని చర్యలు చేపడుతున్నాం. ఎండ తీవ్రత పెరిగిన నేపథ్యంలో జంతువులు, పక్షుల దాహం తీర్చడం కోసం నీటి కొలనులు ఏర్పాటు చేశాం. చెక్‌డ్యామ్‌లు నిర్మించాం. ప్లాస్టిక్ ఫ్రీజోన్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నాం. కొందరు సిగరెట్లు, బీడీలు తాగి అలాగే పడేస్తుండటంతో అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. మొక్కలు కాలిపోతున్నాయి. జంతువులు కూడా చనిపోతున్నాయి. రోడ్లపైకి వన్యప్రాణులు వస్తే వాహనాలను ఆపాలి. అవి వెళ్లిన తరువాత ప్రయాణం సాగించాలి.

– జ్ఞానేశ్వర్, అటవీశాఖ జిల్లా అధికారి

‘గృహజ్యోతి’.. వెలుగులు ఆలస్యం!

- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆగిన పథకం
- జిల్లా వ్యాప్తంగా 1.15లక్షల మంది లబ్ధిదారులు
- త్వరలో లోక్‌సభ ఎన్నికలు రానుండటంతో మరింత ఆలస్యమయ్యే అవకాశం
- ఆందోళనలో లబ్ధిదారులు



మీటర్ రీడింగ్ తీస్తున్న విద్యుత్ సిబ్బంది

తాండూరు: జిల్లాలో గృహజ్యోతి పథకం ఇప్పట్లో అమలయ్యే అవకాశం కనిపించడం లేదు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్, ఆ తరువాత పార్లమెంట్ ఎన్నికలు రానుండటంతో ఉచిత విద్యుత్ అమలు మరింత ఆలస్యం కానుంది. దీంతో రెండు నెలల పాటు లబ్ధిదారులు విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

2,26,668 గృహ విద్యుత్ కనెక్షన్లు

జిల్లాలో 20 మండలాలు, 565 గ్రామ పంచాయతీలు, 330 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. గత నెలలో విద్యుత్ శాఖ అధికారులు గృహజ్యోతి లబ్ధిదారులను ఎంపిక చేశారు. జిల్లా వ్యాప్తంగా 2,26,668 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉండగా తాండూరు డివిజన్ పరిధిలో 1,01,653 కనెక్షన్లు, వికారాబాద్ డివిజన్‌లో 1,25,015 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. గృహజ్యోతి పథకానికి తెల్లరేషన్ కార్డులు ఉన్న వారు అర్హులని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల మొదటి వారం నుంచి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేసేందుకు ఆ శాఖ అధికారులు ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే గత నెల 26నే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఉమ్మడి మహబూబ్‌నగర్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లోని లబ్ధిదారులకు ఈ పథకం అమలుకు కోడ్ అడ్డంకిగా మారింది.

గృహజ్యోతి పరిధిలోకి 1.15 లక్షల కనెక్షన్లు

పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో విద్యుత్ శాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా 1.15 లక్షల కుటుంబాలను గృహజ్యోతి పథకానికి ఎంపిక చేశారు. అయితే కోడ్ అమల్లో ఉండటంతో పథకం నిలిచిపోయింది. మిగతా జిల్లాల్లో యథావిధిగా అమలవుతుండటంతో ఇక్కడ కూడా అమలు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

షాబాద్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని నెహ్రూ యువ కేంద్రం జిల్లా అడ్వైజర్ బోర్డు మెంబర్ దాదె మహేశ్ సూచించారు. గురువారం మండల పరిధిలోని సర్దార్‌నగర్ ప్రభుత్వ పాఠశాలకు నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో క్యారం బోర్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత ప్రభుత్వ పాఠశాలల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ముందుకు రావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల సహకారం అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, అనురాధ, లిఖిత, వనజ, గ్రామస్తులు నరేశ్, ఆకృతి ప్రాజెక్ట్ ఫీల్డ్ ఆఫీసర్ నవిత తదితరులున్నారు.



పెద్ద చెరువు గోపురం

నిండు వేసవిలో జలసిరి

కుతుబ్‌షాహీల వైభవానికి ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు ప్రతీక. దాదాపు 470 ఏళ్ల క్రితం నిర్మించిన చెరువుతో స్థానికులకు ప్రత్యేక అనుబంధం ఉంది. ప్రస్తుతం ఎండలు మండుతున్న తరుణంలో సైతం నీటితో తళుకులీనుతోంది.

- నీటితో కళకళ లాడుతున్న పెద్ద చెరువు
- కట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని స్థానికుల విజ్ఞప్తి

యాచారం: ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు మండుటెండలో సైతం నిండుకుండలా దర్శనమిస్తోంది. రెండేళ్ల కింద కురిసిన భారీ వర్షాలకు చెరువు ఫుల్‌గా నిండి అలుగు పారింది. గతేడాది వర్షాలు కురవకపోయిన చెరువులో నీళ్లు మాత్రం తగ్గడం లేదు. ప్రస్తుతం ఈ చెరువులో కొద్దిగా నీళ్లు తగ్గుముఖం పట్టినట్లు అనిపిస్తున్న మరో రెండేళ్ల పాటు నీళ్లకు ఢోకా ఉండబోదని రైతాంగం గంపెడెశలు పెట్టుకుంది. ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని పలు గ్రామాల్లోని చెరువులు, కుంటలు ప్రస్తుతం ఎండిపోయాయి. గతేడాది నుంచి సమృద్ధిగా వర్షాలు లేకపోయిన చెరువులో నీరు పుష్కలంగా ఉంది. చేవేళ్ల మండలం చందనవెల్లి గ్రామం దగ్గర మూసీనది నుంచి ఫిరంగి నాలా ద్వారా ఈ పెద్ద చెరువుకు వరద నీరు చేరుతుంది. చెరువు నీటి నిల్వ సామర్థ్యంలో 70 శాతంతో ప్రస్తుతం కళకళలాడుతోంది. గతంలో ఫిరంగి కాల్వ కబ్జాలకు గురి కావడంతో కొన్నేళ్ల పాటు చెరువులోకి వరద నీరు నిలిచి పోయింది. మూడేళ్ల కింద కురిసిన భారీ వర్షాలకు ఫిరంగి నాలాలో నిర్మించిన అక్రమ కట్టడాలు కొట్టుకుపోయి భారీ వరద నీరు వచ్చి చేరుతోంది.

పెరిగిన భూగర్భ జలాలు

ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో నీరు సమృద్ధిగా ఉండడంతో ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లోని గ్రామాలతో పాటు మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరు, మహేశ్వరం మండలాలకు చెందిన దాదాపు 200కు పైగా గ్రామాల్లో భూగర్భజలాలు పెరిగాయి. యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, చిట్యాల ప్రాంతాల్లో బోరుబావుల్లో పుష్కలంగా భూగర్భజలాలు ఉంటాయి. దాదాపు 20వేలకు పైగా బోరుబావుల్లో భూగర్భ జలాలు లభిస్తున్నాయి. 25 వేల ఎకరాల్లో పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంది.

మత్స్య సంపద

పెద్ద చెరువు మత్స్య సంపదకు నిలయంగా మారింది. నాలుగైదు ఏళ్లుగా ఈ చెరువులో నీళ్లు సమృద్ధిగా ఉన్నాయి. స్వచ్ఛమైన నీరు ఉండడంతో ఇక్కడ లభించే చేపలకు మంచి డిమాండ్ ఉంది. చేపలను మత్స్యకారులు స్థానికంగా మార్కెట్ లేకపోవడంతో హైదరాబాద్ నగరంతో పాటు ఇతర ప్రాంతాలకు సరఫరా చేసి విక్రయిస్తున్నారు. స్థానికులు కూడా ఎంతో ఇష్టంగా చెరువులో పెరిగే చేపలను కొనుగోలు చేస్తున్నారు. నాలుగైదు ఏళ్లగా రూ.కోట్ల విలువ జేసే మత్స్య సంపదను పట్టి మత్స్యకారులు మంచి లాభాలు పొందుతున్నారు.

పర్యాటక కేంద్రంగా..

1,200 ఎకరాలకు పైగా విస్తరించిన ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు కట్ట పొడవు దాదాపు మూడు కిలోమీటర్ల మేర ఉంటుంది. ఈ కట్టపై నుంచే హైదరాబాద్–నాగార్జునసాగర్ రహదారి ఉంది. నిత్యం ఈ రహదారిపై వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. కానీ పెద్ద చెరువు కట్ట వెడల్పు చేసి పర్యాటన కేంద్రంగా మార్చడంలో పాలకులు విఫలమవుతున్నారు. గత సర్కార్ చెరువు కట్టను పర్యాటన కేంద్రంగా మార్చాలని ప్రయత్నం చేసినా సాధ్యపడలేదు. పర్యాటన కేంద్రంగా మారిస్తే ప్రయాణికులు సేద తీరడంతో పాటు ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి మంచి ఆదాయం కూడా వచ్చే అవకాశం ఉంది. ఈ చెరువు కట్టపై ఉన్న దర్గా, మైసమ్మ తల్లిని దర్శించుకోవడం కోసం నిత్యం వందలాది మంది వస్తుంటారు. చిర్రు వ్యాపారాలతో వందలాది మంది జీవనోపాధి పొందే అవకాశం ఉంది. ఈ దిశగా ప్రభుత్వం కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సమన్వయంతో పనిచేయండి

- పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
- నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు తీసుకోండి
- కలెక్టర్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

అనంతగిరి: ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీల సంఖ్య పెంచేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఏపీఓలు, టీఏలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌ఆర్‌ఈజీఎస్ వ్యవస్థను బలోపేతం చేస్తూ కూలీల సంఖ్యను పెంచుతూ పనులు చేయించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఆదేశించారు. క్లస్టర్ల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసుకొని ఊరికి ఉపయోగపడే పనులు చేయాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను మండల అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ నీరు అందాలన్నారు. గ్రామాల్లో పైప్‌లైన్ లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, ఏఈలు, ఎంపీడీఓల ఆధ్వర్యంలో సమావేశాలు ఏర్పాటు చేసుకొని తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. ఈ నెల 18నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతాయని పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా 80 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మాస్ కాపీయింగ్ జరగకుండా చూడాలని, కేంద్రంలో సీసీ కెమెరాలు, తాగునీరు, విద్యుత్ వంటి సదుపాయాలు ఉండేలా చొరవ తీసుకోవాలన్నారు. పరీక్ష జరిగే సమయంలో కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలని ఆదేశించారు. సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరాదని ఆదేశించారు. ప్రతి సెంటర్‌కు ప్రత్యేక అధికారిని నియమించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఓ శ్రీనివాసులు, జెడ్పీ సీఈఓ సుధీర్, డీఈఓ రేణుకాదేవి, డీపీఓ జయసుధ, మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ బాబు శ్రీనివాస్, గ్రిడ్ ఈఈ చల్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొరియర్‌లో గంజాయి చాక్లెట్లు

- బీహార్ నుంచి నగరానికి సరఫరా
- కార్మికులు, విద్యార్థులకు విక్రయం
- రెండు వేర్వేరు కేసుల్లో 21 వేల చాక్లెట్లు స్వాధీనం
- మేడ్చల్ ఎస్‌ఓటీ దాడిలో ఇద్దరు అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: వాహనాలలో గంజాయి సరఫరాపై పోలీసుల నిఘా పెరడగంతో గంజాయి పెడ్లర్లు రూటు మార్చారు. బీహార్, ఉత్తర్‌ప్రదేశ్ వంటి ఉత్తరాధి రాష్ట్రాల నుంచి కొరియర్‌లో గంజాయి చాక్లెట్లను నగరానికి తీసుకొస్తున్నారు. ఆపై వీటిని స్థానికంగా కిరాణా దుకాణాల ద్వారా విద్యార్థులు, నిర్మాణ కార్మికులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొరియర్‌లో అయితే పోలీసుల తనిఖీలతో పాటు విక్రయం సమయంలో స్థానికులకు ఎలాంటి అనుమానాలు రావని పెడ్లర్లు ఈ మార్గాన్ని ఎంచుకున్నారని మేడ్చల్ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్‌ఓటీ) డీసీపీడీ శ్రీనివాస్ గుప్తా తెలిపారు. తాజాగా రెండు వేర్వేరు కేసులలో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.41 వేలు విలువ చేసే 21 వేలకు పైగా గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. పూర్తి వివరాలివే..

- బీహార్‌కు చెందిన శిబు కుమార్ జీడిమెట్లలోని రామిరెడ్డి నగర్‌కు వలస వచ్చి కిరాణా షాపును నడుపుతూ జీవనాన్ని సాగిస్తున్నాడు. ఆశించిన స్థాయిలో డబ్బు రాకపోవడంతో గంజాయిని విక్రయించి సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈక్రమంలో బీహార్ నుంచి గంజాయి చాక్లెట్లను తీసుకొచ్చి కిరాణా షాపు మాటున ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వలస కూలీలకు విక్రయించడం మొదలు పెట్టాడు. ఈమేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న బాలానగర్ ఎస్‌ఓటీ, జీడిమెట్ల పోలీసులు నిందితుడు శిబు కుమార్‌ను అరెస్టు చేశారు. ఇతని నుంచి రూ. 11,500 విలువ చేసే 150 చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు.
- బీహార్‌కు చెందిన 60 ఏళ్ల వృద్ధుడు సీతారాం సింగ్ పఠాన్ చెరువు వేంకటేశ్వరా కాలనీలో కిరాణా షాపును నిర్వహిస్తున్నాడు. ప్రతి రోజు చేతి సంచిలో గంజాయి చాక్లెట్లు తీసుకెళ్లి రామచంద్రాపురం, బాలాజీనగర్ ప్రాంతంలోని లేబర్ అడ్డాలలో వలస కూలీలకు విక్రయించి, సొమ్ము చేసుకుంటున్నాడు. ఈమేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న మాదాపూర్ ఎస్‌ఓటీ, ఆర్సీపురం పోలీసులు నిందితుడు సీతారాం సింగ్‌ను అరెస్టు చేశారు. ఇతని నుంచి రూ.30 వేలు విలువైన 1,960 చాక్లెట్లు (49 ప్యాకెట్లు)ను స్వాధీనం చేసుకున్నారు.

గాంజా విక్రయిస్తున్న స్టూడెంట్లు..

పాకెట్ మనీ కోసం గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు విద్యార్థులను మాదాపూర్ ఎస్‌ఓటీ, మియాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. గంజాయికి బానిసలైన గణపతినీడి సంతాన్, షాకమూరి తేజేస్‌లు ఆల్విన్ క్రాస్ రోడ్‌లోని ఎస్ఎస్ రాయల్ సూట్ లాడ్జ్ వద్ద విద్యార్థులు, కూలీలకు గంజాయి ప్యాకెట్లను విక్రయిస్తున్నారు. ఈమేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. వీరి నుంచి 1.7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిజాంపేటలోని శేఖర్ పాన్ షాప్, కింగ్ పాన్ షాప్‌లలో నిషేధిత సిగరెట్లను విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న బాలానగర్ ఎస్‌ఓటీ, బాచుపల్లి పోలీసులు ఆకస్మికంగా దాడులు చేశారు. కూకట్‌పల్లికి చెందిన సీ చంద్రశేఖర్, మియాపూర్‌కు చెందిన కే బాలరాజులను అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.16 వేలు విలువ చేసే 114 ప్యాకెట్ల నిషేధిత సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా

ఎనిమిది మందిపై మాల్ ప్రాక్టీస్ కేసు

అనంతగిరి: ఇంటర్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలలో భాగంగా గురువారం మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన ఎనిమిది మంది విద్యార్థులపై కేసులు నమోదైనట్లు జిల్లా నోడల్ అధికారి శంకర్ తెలిపారు. పెద్దేముల్ పరీక్ష కేంద్రంలో కాపీ కొడుతున్న ఆరుగురు విద్యార్థులు, కోకట్‌లో ఇద్దరు విద్యార్థులను తెలంగాణ ఇంటర్ బోర్డు పరిశీలకులు డిబార్ చేసినట్లు ఆయన ప్రకటించారు. జనరల్ కోర్సులలో 6,447 మంది విద్యార్థులకు గాను 6,301 మంది విద్యార్థులు, ఒకేషనల్ కోర్సులలో 1,298 మందికి గాను 1,255 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



గేదె కళేబరం

కుల్కచర్ల: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. సాల్వీడు గ్రామానికి చెందిన చెంచు మర్పల్లి సాయన్న గురువారం తన పొలంలో గేదెను మేపుతూ పనులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గేదె బొంరెడ్డిపల్లి గ్రామశివారు వద్ద విద్యుత్ తీగను తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. లక్ష రూపాయలు అప్పు చేసి గేదెను కొన్నానని బాధితుడు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలని ఆయన కోరారు.

భారీ మెజార్టీతో గెలిపించుకుందాం

అనంతగిరి: చేవెళ్ల పార్లమెంట్ ఎంపీ బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో ఉన్న కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఈ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు మంచన్‌పల్లి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మోసపూరిత మాటలతో కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిన కొద్ది కాలంలోనే ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటుందన్నారు. ప్రభుత్వం ఏర్పడి నుంచి ఇప్పటికి చాలా మంది రైతులకు రైతుబంధు నిధులు పడక ఇబ్బంది పడుతున్నారన్నారు. పార్టీని ఎవరు వీడినా నష్టం లేదని అధికారం ఎక్కడుంటే అక్కడ వెళ్లే నాయకులకు ఈ ప్రాంత ప్రజలు సరైన గుణపాఠం చెబుతారన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలకు భవిష్యత్ ఉంటుందన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి

తాండూరు రూరల్: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మిట్టబాసుపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మంగళి పండరి (56) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. బుధవారం గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు మృతి చెందడంతో అంత్యక్రియలకు వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో గ్రామ శివారులోని ఓ బావి వద్ద స్నానం చేసేందుకు దిగారు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో స్థానికుల సమాచారంతో బావి వద్దకు వెళ్లి చూడగా ఆయన మృతదేహం లభ్యమైంది. స్నానానికి వెళ్లిన పండరి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు పోలీసులు భావించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తింపు లేని బడులపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ నాయకుల డిమాండ్

చేవెళ్ల: గుర్తింపు లేకుండా నడుస్తున్న ఓ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్‌కుమార్, శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. స్థానికంగా గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. మండల విద్యాధికారి అక్బర్ నిర్లక్ష్య వైఖరి కారణంగా ఇలాంటి పాఠశాలలు కొనసాగుతున్నాయని ఎంఈఓపై చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతి లేకుండా ఈ ఏడాది పాఠశాల యాజమాన్యం విద్యార్థుల అడ్మిషన్లు తీసుకొని వేల రూపాయల ఫీజులు వసూలు చేస్తోందన్నారు. అనేక మాయమాటలు చెప్పి అడ్మిషన్లు పొందిన తరువాత మోసం చేస్తున్నారన్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి తనిఖీలు చేసి విద్యార్థులునష్టపోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.



రైల్వేస్టేషన్ వద్ద పైప్‌లైన్ పనుల కోసం తవ్విన రోడ్డు



చందుమహరాజ్ చౌక్ వద్ద ధ్వంసం చేసిన రహదారి

ప్రణాళిక మరిచి.. నిధులు పరిచి!

- భగీరథ పేరిట నూతన రోడ్లను తవ్వేస్తున్న వైనం
- ప్రభుత్వ శాఖల మధ్య లోపించిన సమన్వయం

తాండూరు: పట్టణాన్ని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులు చేయించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది. కానీ అధికారుల నిర్లక్ష్యానికి ప్రజాధనం యథేచ్ఛగా కరిగిపోతుంది. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో రూ.కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు మళ్లీ మరమ్మతులు చేసి నిధులను దుర్వినియోగం చేస్తున్నారు. చేయాల్సిన పనుల్లో ప్రణాళిక లోపించడంతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రూ.32.5 కోట్లతో సీసీ రోడ్లు

తాండూరు పట్టణంలో రోడ్ల అభివృద్ధికి గత ప్రభుత్వం తెలంగాణ అర్బన్ ఇండస్ట్రియల్ అండ్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ.25 కోట్లను మంజూరు చేసింది. రెండేళ్ల క్రితం పలు ప్రధాన మార్గాలను విస్తరించి సీసీ రోడ్డు వేశారు. మరోవైపు ఆర్అండ్‌బీ శాఖ ద్వారా రూ.7.50 కోట్లతో ఇందిరాచౌక్ నుంచి హైదరాబాద్ రోడ్డు మార్గంలోని విలియంమూన్ చౌక్ వరకు సీసీ రోడ్డు నిర్మించారు. దీంతో ఐదేళ్ల వ్యవధిలో రూ.32.50 కోట్ల నిధులతో సీసీ రోడ్లను వేశారు. అయితే పట్టణంలోని ఇందిరాచౌక్ నుంచి రైల్వేస్టేషన్ వరకు రూ.6.08 కోట్లతో నాలుగు వరుసల రోడ్డు, సెంట్రల్ లైటింగ్.. ఇరిగేషన్ కార్యాలయం నుంచి రైల్వే స్టేషన్ వరకు రూ.4.05 కోట్లతో సీసీ రోడ్డు.. శివాజీ చౌక్ నుంచి సీతారాంపేట్ మార్గానికి రూ.7.5 కోట్లతో 15.5 మీటర్ల రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్.. పట్టణ శివారులోని ఖాంజాపూర్ నుంచి చందుమహరాజ్ చౌక్ వరకు రూ.4 కోట్లతో నాలుగు వరుసల రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టారు. దీంతో భారీ వాహనాలతో రోడ్డు నాణ్యత పెంచాలనే ఉద్దేశంతో సీసీ రోడ్లను వేశారు.

పైప్‌లైన్ కోసం ధ్వంసం

పట్టణంలో రోడ్డు పనులను గతేడాది పూర్తి చేశారు. దీంతో రోడ్డు వ్యవస్థ మెరుగు పడిందని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కానీ వారి సంతోషం ఎక్కువ రోజులు లేదు. మిషన్ భగీరథ పైప్‌లైన్ కోసం నూతనంగా వేసిన రోడ్లను యథేచ్ఛగా ధ్వంసం చేస్తున్నారు. దీంతో పటిష్టంగా ఉన్న సీసీ రోడ్లు పూర్తిగా అధ్వానంగా మారాయి. రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు కాక ముందే మిషన్ భగీరథ పైప్‌లైన్‌లు చేపట్టాల్సి ఉంది. కానీ అధికారుల, ప్రజా ప్రతినిధుల అలసత్వానికి వెరసి మిషన్ భగీరథ పనుల్లో భాగంగా గతంలో రూ.కోట్లతో వేసిన సీసీ రోడ్లను తవ్వేస్తుండటం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రజాధనం దుర్వినియోగంతో పాటు రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని వాపోతున్నారు.

అధికారులకు నివేదించాం

రోడ్ల ధ్వంసం విషయంపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో మిషన్ భగీరథ పనులు నిలిపివేయాలని సూచించాం. కానీ సదరు అధికారులు తాగునీటిని అందించేందుకే పైప్‌లైన్ పనులు వేస్తున్నామని, అందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని చెప్పారు. ఏడేళ్ల క్రితమే రోడ్డు వేసే సమయంలోనే పైప్‌లైన్ వేసుకోవాలని భగీరథ అధికారులకు చెప్పినా వినలేదు. ప్రస్తుతం ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– శ్రీనివాస్, డీఈఈ, ఆర్అండ్‌బీ శాఖ, తాండూరు

నామినేటెడ్ పోస్టుల్లో గిరిజనులకు ప్రాధాన్యం

కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్



మాట్లాడుతున్న గోపాల్ నాయక్ తదితరులు

కుల్కచర్ల: నామినేటెడ్ పోస్టులను గిరిజన ప్రజలకు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్ అన్నారు. గురువారం ఆయన మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో కీలకపాత్ర పోషించిన గిరిజన ప్రజలకు పార్టీ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. పరిగి నియోజకవర్గంలో రామ్మోహన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందడంలో గిరిజనుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. గిరిజన ప్రజలను గౌరవించే క్రమంలో నామినేటెడ్ పదవుల్లో గిరిజన నాయకులకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తుకారం, వినోద్, భాస్కర్, శంకర్ పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

- నేటి నుంచి ఒంటిపూట బడులు
- 18 నుంచి టెన్త్ పరీక్షలు షురూ
- పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లతో కలెక్టర్ సమీక్ష
- కాపీయింగ్‌కు ఆస్కారం ఇవ్వొద్దని సూచన

సాక్షి, రంగారెడ్డిజిల్లా: తెలంగాణ ఇంటర్మీడియట్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. జిల్లావ్యాప్తంగా ద్వితీయ సంవత్సరంలో చివరిరోజు 68,268 విద్యార్థులకు గాను 66,298 మంది పరీక్షకు హాజరయ్యారు. అదేవిధంగా ఫస్ట్ ఇయర్‌లో 80,320 మంది విద్యార్థులకు గాను 77,722 మంది పరీక్ష రా శారు.ఎలాంటి మాల్ ప్రాక్టీస్, డిబార్ కేసులు నమో దు కాలేదు. పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. అయితే ఎంఆర్ఎంఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ మారేడ్‌పల్లిలో ఇప్పటికే సంస్కృతం ప్రశ్నాపత్రాల మూ ల్యాంకనం ప్రారంభమవ్వగా శనివారం నుంచి మెయిన్ సబ్జెక్టుల మూల్యాంకనం కొనసాగనుంది. ఏప్రిల్ నెలాఖరు వరకు ఫలితాలు వెల్లడించే అవకా శం ఉంది.వేసవి సెలవులు ప్రకటించడంతో ఇప్పటివర కు ప్రభుత్వ, ప్రైవేటు రెసిడెన్షియల్ కాలే జీల్లో ఉన్న విద్యార్థులు ఇంటిబాట పట్టారు. వీరంతా జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్నారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు..

వేసవి నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు శుక్రవారం నుంచి ప్రభుత్వం ఒంటిపూట బడులను ప్రకటించింది. టెన్త్ వార్షిక పరీక్షా కేంద్రాలు ఎంపిక చేసిన పాఠశాలల్లో.. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు మధ్యాహ్నం నుంచి తరగతులు నిర్వహించనున్నారు. పరీక్షా కేంద్రాలు ఎంపిక చేయని పాఠశాలల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఈ నిబంధనలను తప్పనిసరి పాటించాల్సిందిగా జిల్లా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.

కాపీయింగ్‌కు ఆస్కారం ఇవ్వొద్దు..

పదవ తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 239 పరీక్ష కేంద్రాల్లో 50,946 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని.. ఆయ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిందిగా సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశాలు జారీ చేశారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. పరీక్షల నిర్వహణలో చిన్న పొరపాటుకు కూడా ఆస్కారం ఇవ్వొదని సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో కచ్చితంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా బస్సులు నడపాలని కోరారు. పరీక్ష కేంద్రంలో మొబైల్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. ఆశ వర్కర్లు, అవసరమైన మందులు ప్రతి పరీక్ష కేంద్రంలో ఉండేలా చూడాలన్నారు. ఇన్విజిలేటర్లు పరీక్ష సమయానికి ముందే రావడంతో పాటు చివరిదాకా ఉండాలని అన్నారు. కాపీయింగ్ జరగకుండా చీఫ్ సూపరింటెండెంట్లు పర్యవేక్షణ జరపాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, చీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నోడల్ అధికారులదే కీలక పాత్ర

లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులదే కీలక పాత్ర అని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శశాంక అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నోడల్ అధికారులందరూ వారికి కేటాయించిన అంశాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. అన్ని విషయాలపై నోడల్ టీంలకు శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. మొదటి ర్యాండమైజేషన్ తర్వాత పీఓ, ఏపీఓలకు సైతం శిక్షణ ఏర్పాటు చేయాలన్నారు. పట్టణ స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ఓటరు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సంబంధిత స్వీప్ నోడల్ అధికారికి సూచించారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది వివరాలను శాఖల వారీగా అందించాలని సూచించారు. సిబ్బందికి సంబంధించిన ఇంటి చిరునామాలు, ఎపిక్ కార్డుల వివరాలు తప్పనిసరిగా అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీలక్ష్మి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత, సీపీఓ సౌమ్య, డీసీసీఓ ధాత్రిదేవి, డీపీఓ సురేష్ మోహన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్, ఎన్నికల విభాగం అధికారి సైదులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ శశాంక

వేలిముద్రలతో రూ.20 వేలు గల్లంతు

పోలీసులు, బ్యాంకుకు ఫిర్యాదు చేసిన బాధితుడు

ధారూరు: సైబర్ నేరగాళ్ల దెబ్బకు అమాయకులు బలి కావడం ఇటీవల షరా మామూలైంది. పిల్లల ఆధార్‌కార్డు నమోదు కోసం వెళ్లిన ఓ అభాగ్యుడు వేలిముద్రలు పెట్టడమే తడవుగా రూ.20 వేలు సమర్పించుకున్నాడు. ఫోన్ వచ్చిన మేసేజ్ చూసి లబోదిబోమన్నాడు. ఈ సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. బాధితుడి వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన హఫీజ్ గతేడాది డిసెంబర్ 30న తన పిల్లలకు కొత్త ఆధార్ కార్డు తీయడానికి కేంద్రానికి వెళ్లారు. అక్కడ ఆయన వేలిముద్రలు పెట్టగానే, తన అకౌంట్ నుంచి రూ.20 వేలు డ్రా అయ్యాయి. ఈ విషయాన్ని యోనో యాప్‌లో జనవరి 1న చూసి అవాక్కు అయ్యారు. విత్‌డ్రా చేయకుండా డబ్బులు ఎలా వెళ్లాయని పోలీసులు, బ్యాంకును ఆశ్రయించారు. నేటికి పోయిన డబ్బుల కోసం బ్యాంకు చుట్టూ ప్రదక్షిణలు చేసినా లాభం లేకపోయింది. బ్యాంక్ మేనేజర్‌ను సంప్రదిస్తే సరైన సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారు. ఈ విషయమై నూతన ఎస్ఐకి హఫీజ్ గురువారం వివరించారు.

విచారణ చేస్తున్నాం

ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ ద్వారా సమాచారం సేకరించి విచారణ చేపట్టి వాస్తవం మేరకు చర్యలు తీసుకుంటాం. వేలిముద్రల ద్వారా డబ్బులు పోయాయి. ఏ ఆపరేటర్ వేలిముద్రలు తీసుకున్నారనేది తేలాల్సి ఉంది.

– ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్

హెడ్ ఆఫీస్‌కు సమాచారం ఇచ్చాం

ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయానికి సమాచారం ఇచ్చాం. డబ్బులు వేలిముద్రల ద్వారా వెళ్లాయి. ఇంతకు ముందున్న ఎస్ఐకి పూర్తి సమాచారం ఇచ్చాం. అదే సమస్యపై మళ్లీ అడుగుతున్నారు. అర్ధరాత్రి డబ్బులు వెళ్లాయంటే వినియోగదారుడు వేలిముద్రలు పెట్టలేదనేది వాస్తవమే. డబ్బులు వెళ్లిన లోకేషన్ కోసం ముంబాయి హెడ్ ఆఫీస్‌కు దరఖాస్తు పెట్టాం. ఏయిర్‌టెల్ కంపెనీ, పోస్టాఫీస్‌కు ఫింగర్‌ప్రింట్ ద్వారా డబ్బులు డ్రా చేసే పవర్ ఇచ్చారు. నివేదిక వస్తే వాస్తవం బయటపడుతుంది.

– ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ రవి

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేతలు

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ప్రధాన రోడ్లపై నిబంధనలకు విరుద్ధంగా మురుగు కాల్వలపై అడ్డగోలుగా నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని సీపీఎం జిల్లా అధ్యక్షుడు మైపాల్ ఆరోపించారు. ఈమేరకు గురువారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అధికారులు అక్రమ నిర్మాణాలతో సాధారణ ప్రజల వాహనాల పార్కింగ్‌కు కూడా అవకాశం లేకుండా పోతుందన్నారు. పలు చోట్ల వాహనాలు పార్కింగ్ చేయడానికి సైతం స్థలం లేకుండా ఉందన్నారు. దుకాణాల ఎదుట అక్రమంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపి అక్రమ నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కుమార్, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ధరణిపై ఆందోళన వద్దు

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఎమ్మెల్యే మల్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రైతులు

యాచారం: ప్రభుత్వ భూములు కాజేయాలనే ఉద్దేశంతోనే బీఆర్ఎస్ సర్కార్ ధరణి పోర్టల్‌ను తీసుకువచ్చిందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని గునుగల్‌కు చెందిన పలువురు రైతులు గురువారం ఎమ్మెల్యే మల్‌రెడ్డిని కలిసి భూ సమస్యలపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ధరణి పోర్టల్‌లోని సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఓ ప్రత్యేక కమిటీని నియమించిందని... ఆ కమిటీ ఇప్పటికే అనేక సమస్యలను గుర్తించిందని తెలిపారు. త్వరలో భూసమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. త్వరలో నియోజకవర్గంలోని భూ సమస్యలపై ఆర్డీఓ, రెవెన్యూ అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. గునుగల్‌లో అయ్యప్పస్వామి దేవాలయం కోసం స్థలం కేటాయించాలని రైతులు ఎమ్మెల్యేను కోరారు. శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ యాదవ్, సీనియర్ నాయకులు లక్ష్మణ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడికి చర్యలు

కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

కొడంగల్: మండల పరిధిలోని పలు శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో మంచినీటి సమస్యలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. త్వరలో పదో తరగతి పరీక్షలు ఉన్నందున విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. మండల పరిధిలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలంలో కూలీలకు జీవనోపాధి పనులు కల్పించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, ఎంఈఓ రాంరెడ్డి, మిషన్ భగీరథ ఈఈ నాగేశ్వర్‌రావు, ఎంపీడీఓ ఉషశ్రీ, డీటీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌ను కలిసిన కార్యకర్తలు



సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న కార్యకర్తలు

కొడంగల్: సీఎం రేవంత్‌రెడ్డిని కొడంగల్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. తమ అభిమాన నాయకుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత తొలిసారి కలవడం అదృష్టంగా భావిస్తున్నట్లు వారు ఆనందం వ్యక్తం చేశారు. సీఎంని కలిసిన వారిలో పార్టీ కొడంగల్ పట్టణ ప్రచార కార్యదర్శి కృష్ణంరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి అరబ్ రమేష్, కమ్మరి సాయిలు, అశోక్ తదితరులు ఉన్నారు.

సల్లంగ చూడు తల్లీ

- మన్నాన్‌పల్లిలో ఎల్లమ్మ బోనాలు ప్రారంభం
- ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి



వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితారెడ్డి, నాయకులు

మహేశ్వరం: మండల పరిధిలోని మన్నాన్‌పల్లి గ్రామంలో శ్రీరేణుకా ఎల్లమ్మ దేవత బోనాల జాతర గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఘటాల ఊరేగింపు, పోతరాజుల విన్యాసాలు, యువకుల నృత్యాలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, తీగల కృష్ణారెడ్డి, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ జంగారెడ్డి వేడుకల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరినీ చల్లగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. అతిథులను ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ కమిటీ ట్రస్టీ, చైర్మన్ మురళీధర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా నాయక్, మాజీ జెడ్పీటీసీ నేనావత్ ఈశ్వర్ నాయక్, మన్నాన్‌పలి మాజీ సర్పంచ్‌లు కంది అరుణరమేష్, మల్లేష్ యాదవ్, మాజీ ఉప సర్పంచ్ నర్సింహ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నేత జాన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పది'కి పక్కా ప్రణాళిక

షాబాద్: ఇన్నాళ్లు వారివారి పాఠశాలల్లోనే వార్షిక పరీక్షలు రాశారు. పదో తరగతికి చేరి తొలిసారి బోర్డు పరీక్షలకు హాజరు కానున్నారు. ఈ క్రమంలో విద్యార్థుల్లో కాస్త ఒత్తిడి, భయం ఉండటం సహజం. కానీ పరీక్షలు సమీపిస్తున్న వేళ ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రణాళికాబద్ధంగా చదవితేనే మంచి మార్కులు వస్తాయంటున్నారు ఆయా సబ్జెక్టుల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు. పదో తరగతి బోర్డు పరీక్షలు ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటివరకు చదవింది ఒక ఎత్తు అయితే. ఈ నాలుగు రోజుల్లో చదవడాన్ని కీలకంగా భావించాల్సి ఉంటుందన్నారు. ఆంగ్లం, గణితం, సైన్స్, సోషల్, సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధించాలంటే పక్కా ప్రణాళిక అవసరం అంటున్నారు. ఆయా సబ్జెక్టుల్లో ఉపాధ్యాయులు సలహాలు ఇచ్చారు.

ఒత్తిడిని జయించాలి..

బోర్డు పరీక్షలకు హాజరుకావడం తొలిసారి అయినందున విద్యార్థులు ఆందోళనకు గురవుతుంటారు. ఇవి కూడా పాఠశాలల్లో రాసిన పరీక్షలుగా భావించి ఒత్తిడిని దూరం చేసుకోవాలి. పరీక్షల్లో విజయం తమదేనని నమ్మకంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చేస్తున్న సూచనలను పాటిస్తూ ముందుకు సాగితే మంచి జీపీఏ సాధించడం సులభమే. ప్రశాంత వాతావరణంలో ఉదయం 5 గంటలకే లేచి చదివితే మంచిది. అదేవిధంగా సబ్జెక్టులోని కీలక అంశాలను ఎప్పటికప్పుడు నోట్స్‌గా రాస్తే పాయింట్ల వారీగా పరీక్షల్లో రాసేందుకు అవకాశం ఉంటుంది. పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో పది జీపీఏ లక్ష్యంగా విద్యార్థులు ముందుకెళ్తున్నారు. పదిలో వందశాతం ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ముందస్తు ప్రణాళిక, హార్డ్‌వర్క్‌తోనే లక్ష్యాన్ని చేరుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

ముందస్తుగా అవగాహన..

పదో తరగతి పరీక్షల కోసం విద్యార్థులకు పాఠశాలల్లో ముందస్తుగా అవగాహన కల్పిస్తున్నారు. ప్రైవేట్‌కు దీటుగా పాఠశాలల్లో ఉదయం పూట, సాయంత్రం పూట అదనంగా గంట పాటు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 9కి పైగా జీపీఏ సాధించేందుకు ఉదయం, సాయంత్రం క్లాసులు నిర్వహిస్తున్నారు. రోజుకో పరీక్ష నిర్వహించి బిట్స్ ఎలా రాయాలో పేపర్‌ను తయారు చేసి అవగాహన కల్పిస్తున్నారు. అన్ని సబ్జెక్టులపై సమాన దృష్టి పెట్టి పరీక్షలకు సిద్ధమవుతున్నారు. సెలవు రోజుల్లో ప్రత్యేక తరగతులు కొనసాగిస్తున్నారు.